
# నో కామెంట్

– జె. చలమయ్య

మోడల్ 1992 యమహా బండిని జోరుగా పోనిస్తున్నాడు అనిల్.. సిటీ వీథుల్లో చాలాసేపు స్వైరవిహారం చేసిన తరువాత చివరగా తాజ్ కాంటినెంటల్ ముందు ఆపాడు. రిసెప్షన్ హాల్లో పెద్ద పార్టీ ఏదో జరుగుతోంది. బేరర్లు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. సీరియల్ లైట్లతో, జిగేలుమనే భారీ డెకొరేషన్‌తో ఆ వాతావరణం చాలా ఆహ్లాదంగా అనిపించింది. బైక్ పార్క్ చేసి ఖాళీగా ఉన్న ఓ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. టేబుల్‌పై కాండిల్ స్టాండులో వెలుగుతున్న కొవ్వొత్తి అందంగా సిగ్గుపడుతోంది. ఆ వెలుగు చూస్తూనే ఆలోచనల్లోకి పరుగెత్తింది మనసు.



ఓ ఆయిల్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న తన ఆదాయం అయిదంకెలు పైనే. బాధ్యత లేని లేనిజీవితం. కానీ వివాహమే పెద్ద సమస్య అయి కూర్చింది. జీవితమే ఒక ఆటగా, పాటగా తీసుకుని హాయిగా గడపడం తన హాబీ. అందుకనుగుణంగా ప్రవర్తించే అమ్మాయి తనకింత వరకు తారసపడలేదు. అదే కుదిరి వుంటే 35 ఏళ్ళకు కూడా బ్రహ్మచారిగా ఉండాల్సిన బాధ తప్పేది. విధి అనేది సైన్సులో లేకపోయినా, జీవితంలో మాత్రం నమ్మక తప్పడంలేదు.

"సార్. మెనూ కార్డ్" బేరర్ పలకరింపుతో ఆలోచనలు ఆగిపోయాయి.

"ఒన్ లార్జ్ విస్కీ విత్ సోడా, లివర్ ఫ్రై" జవాబు చెప్పాడు అనిల్. బేరర్ వెళ్ళిపోయాడు.

"నేను మీ ఎదురుగా కూర్చోవచ్చునా?" ఎవరో మర్యాద పూర్వకంగా అడిగారు.

"ఓ యస్. ప్లీజ్ బి సీటెడ్" చెప్పాడు అనిల్.

"అయాం యశ్వంత్ సక్సేనా, ప్రొప్రైటర్, హిమాలయ ఎలక్ట్రానిక్స్"

సాయంకాలం ఎక్కడో మెయిన్‌రోడ్డులో ఆ షాపు బోర్డు చూసినట్లు గుర్తు. చాలా పెద్దషాపు.

"ఏం తీసుకుంటారు సార్" బేరర్ అతన్ని ప్రశ్నించాడు.

"ఒన్ లార్జ్ బీర్ అండ్ ఎగ్ ఫ్రై"

అనిల్ పగలబడి నవ్వాడు.

"బహుశా బార్‌కు మొదటిసారిగా వచ్చారనుకుంటాను" చెప్పాడు అనిల్.

ఎక్కడో ఏదో పొరబాటు జరిగింది. అదేంటో అర్థం కాలేదు సక్సేనాకు.

"మీకెలా తెలుసు. నేను బార్‌కి కొత్తగా వచ్చానని?"

"వెరీ సింపుల్ లాజిక్. జిన్, విస్కీ, రమ్ మాత్రమే లార్జ్ లేదా స్మాల్ పెగ్స్‌లో తీసుకుంటారు. .కానీ బీర్ మాత్రం అలాకాదు"

"ఓహో అలాగా. బేరర్ ఒన్ గ్లాస్ బీర్ అండ్ ఎగ్ ఫ్రై" బేరర్ వెళ్ళిపోయాడు.

సక్సేనా మళ్ళీ ప్రారంభించాడు. "ఇపుడు మీరు చెప్పండి. మీరు సింగిలా, మారీడా? ఏం చేస్తున్నారు. పేరేంటి? "

"నా పేరు అనిల్. నేను ప్రస్తుతం బార్‌లో మీ సాక్షిగా మందుకొడుతున్నాను. గల్ఫ్ ఆయిల్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. ఫామిలీ లేదు. ఎందుకంటే వివాహం కాలేదు కాబట్టి" అని

"మరి మీ గురించి చెప్పండి" అడిగాడు అనిల్.

"మీకో షాకింగ్ ఫాక్ట్. వలభై దాటినా నేనింకా పెళ్ళి చేసుకోలేదు. బాచిలర్‌నే. ఎందుకో తెలుసునా? పెళ్ళి చేసుకుని ఆ ముక్కుతాడు తగిలించుకుని లైఫ్‌ని రూయిన్ చేసుకోవడం నాకిష్టంలేదు." సిగరెట్ పొగ రింగులు రింగులుగా వదులుతూ చెప్పాడు సక్సేనా.

ఇట్లా కూడా ఆలోచించే మనుషులుంటారని మొదటిసారిగా తెలుసుకున్నాడు అనిల్. మొదటి రౌండ్ పూర్తయింది. ఇద్దరూ రెండో రౌండులోకి దిగారు. స్నాక్స్ ప్లేట్లు ఖాళీ అవుతున్నాయ్. ఫుల్ ప్లేట్లు మళ్ళీ ప్రత్యక్షమౌతున్నాయి.

"అసలు స్త్రీ అంటే మీ అభిప్రాయం ఏంటి?" అడిగాడు అనిల్.

"వెరీ సింపుల్. స్త్రీ ఓ అందమైన బొమ్మలాంటిది. అందమైన బొమ్మను ఏం చేస్తాం? కాసేపు ఆడుకుంటాం, తర్వాత వదిలేస్తాం" అంతే. అంతకుమించి మరే సంబంధం ఉండకూడదు."

"ఇక మీరెప్పటికీ పెళ్ళి చేసుకోరా?"

"నో. నెవర్. ఆ అవసరం ఎప్పటికీ లేదు. రాదు"

"మరి రిటైర్ అయ్యాక .ముసలితనంలో... ...."

"స్టాపిట్. ఏమీ అనుకోనంటే ఓ మాట. మీరు కనీసం ఓ శతాబ్దం ముందు పుట్టాల్సినవారు. లేకపోతే ఏంటండీ, ఇరవైఏళ్ళు పెళ్ళాం బిడ్డలకు ఖర్చుపెట్టే డబ్బుకు ఓ నౌకరు దొరక్కపోతాడా. అదో పెద్ద సమస్యగా మాట్లాడుతున్నారు" బీర్ బాగా కిక్ ఇచ్చినట్లుంది. మాట కొంచెం తడబడుతూ ఉంది.

అనిల్‌కు ఈ పెద్దమనిషి చెప్పేదంతా వింటూ ఉంటే మతిపోతోంది. అసలు పెళ్ళినేదే అంత అనవసరమైతే, సీతారాముల కాలం నాటినుండి క్రమం తప్పకుండా, ఇన్ని వేల సంవత్సరాల కాల పరీక్షకు నిలిచేది కాదు. కాలంతో బాటు ఎన్నో మారినా, వివాహ వ్యవస్థ మాత్రం యుగాల నుండి పదిలంగా ఉంది. అనిల్ విశ్లేషణకు యశ్వంత్ వాదం నిలవలేదు. రెండో రౌండు డ్రింక్స్ కూడా పూర్తయ్యాయి.


హాల్లో ఎందరో జంటలు. కొందరు వంటరిగా కాలక్షేపం చేస్తున్నారు. రాక్ బ్యాండ్ 'ఐ లవ్ యూ' వాయిస్తోంది. డాన్సింగ్ ఫ్లోర్ మీద రెండు జంటలు లయబద్ధంగా అడుగులేస్తూ డాన్స్ చేస్తున్నారు.

"అదిగో ఆ మెరుపు తీగను చూడండి. బంగినపల్లి మామిడిపండులా లేదూ. చూస్తుంటే కసిదీరా కొరకాలనిపించడం లేదూ!" యశ్వంత్ కామెంట్ చేశాడు.

నిజంగా చాలా అద్భుత సౌందర్యంతో మెరిసిపోతోంది ఆ సుందరి. పార్టీలో చాలామంది ఆమెకు 'హలో' చెబుతున్నారు. ఆమె ఎవరినీ పట్టించుకోకుండా ఒక్కతే డాన్సింగ్ ఫ్లోర్ మీద నృత్యం ప్రారంభించింది. ఎంతోమంది ఆశగా ఆకలిగా ఆమెవైపు చూస్తున్నారు.

రెండు రౌండ్లు కొంచెం త్వరగా లాగించెయ్యడం వలన విస్కీ తలదిమ్ము పుట్టిస్తోంది అనిల్‌కు. యశ్వంత్ వాగుడు కూడా ఎక్కువ అవుతోంది. జవాబు ఏం చెప్పకుండా అన్నిటికీ 'ఊ' కొడుతున్నాడు అనిల్.

"ఏయ్! అటు చూడు అనిల్. స్టన్నింగ్ 'బ్యూటీ కదూ. పనస తొనల్లాంటి ఆ బుగ్గలు చూడు. ఆ బుగ్గల్నీ పెదవుల్నీ హాయిగా తృప్తిగా జుర్రుకోవాలనిపించడం లేదూ" యశ్వంత్ కామెంట్. బీర్ చాలా త్వరగా కిక్కిచ్చింది. సంభాషణ ఏకవచనంలోకి వచ్చింది. అయినా చిరునవ్వుతో మిన్నకుండిపోయాడు అనిల్.




యశ్వంత్ చూపించిన అమ్మాయి కూడా బ్రహ్మ చాల జాగ్రత్తగా మలిచిన శిల్పంలా ఉంది. 'అయినా అమ్మాయిని పన ు తొనతో పోలుస్తున్నాడేంటి. కొంపదీసి శాడిస్టుకాదు కదా!'

"చూడండి యశ్వంత్. ఆ స్వీట్ బ్యూటీని చూడండి. ఆమె బుగ్గలు ఎలా పింక్ కలర్ ఊరిస్తున్నాయో అచ్చం. సిమ్లా ఆపిల్స్‌లాగా లేవూ. ఆమె తెల్లటి జబ్బలు చూస్తుంటే, ఇపుడే వాటిని సొంతం చేసుకోవాలనిపించడంలేదూ" గబ గబ చెప్పిం తర్వాత, స్త్రీల గురించి అలా మాట్లాడింది, మాట్లాడగలిగింది తనేనా అని ఆశ్చర్యపోయాడు అనిల్.

యశ్వంత మొహంలో వేగంగా రంగులు మారాయి. బీర్ తాగడంతో ఎరుపెక్కిన కళ్ళు, చెక్కిళ్ళు మరింత ఎరుపెక్కాయి.

"యూ మీన్. ఆ క్రీమ్ కలర్ షిఫాన్ చీర లేడీ గురించేనా నువ్వు చెప్పింది" పిడికిళ్ళు బిగించి అన్నాడు. అతని బీర్ గ్లాసులోంచి ఒలికిపోయింది. స్పూన్, ఫోర్క్ కిందపడ్డాయి.

"ఇది చాలా అన్యాయం బ్రదర్. నేనొక్కడినే మాట్లాడుతున్నాను. నీవు నన్ను జోకర్‌ని చేస్తున్నావు" యశ్వంత్ కంప్లయింట్.

"నో అదేంలేదు. నేను కూడా మాట్లాడుతున్నాను కదా!" చెప్పాడు అనిల్.

"కానీ - నువ్వు కామెంట్ చేయడంలేదు. నెక్స్ట్ యంగ్ లేడీ మీద నీవు కామెంట్ చెయ్యాలి ఓ.కె."

"ఓ.కె. దానిదేముంది. డన్"

పెదిమల దగ్గర విస్కీ గ్లాసు పెట్టుకుని సిప్ చేస్తుంటే ఆ చేదులోని తీయదనం అదో వింత అనుభూతిని కలిగిస్తోంది. అదే విస్కీలోని గొప్పదనం. తాగేవాడికి దాని రంగు, రుచి, వాసన ఎప్పుడూ ఊరిస్తుంటాయి. గొంతులోంచి గుండెలోకి నిప్పుకణికలు జారినట్లు వేడిగా విస్కీని గుటకేశాడు. రెండు నిముషాలు మౌనంగా ఆలోచిస్తూ గడిపాడు అనిల్. కళ్ళు తెరిచేటప్పటికి ఓ బ్యూటీ లోనకొస్తూ కంటబడింది. ఆమె మేను తెల్లటి మీగడ తరకలతో పోటీపడేలా ఉంది. ఆమె యవ్వనపు పొంగులు, అదో బ్యూటీ కంటెస్ట్ వాతావరణంలా భ్రమింపజేస్తున్నాయి. ఆమె చిరునవ్వులు వెన్నెలలు కురిపిస్తున్నాయి. "ఇపుడు యశ్వంత్ లాగా తను కూడా కామెంట్ చేయాలి కదూ. ఏం చేయాలి. ఎలా చెప్పాలి?" అనుకున్నాడో క్షణం అనిల్.

"ఏమైంది ఇతనికి. ఇంతదాకా బాగానే ఉన్నాడే. పిచ్చిగాని పట్టలేదు కదా" అనుమానించాడు అనిల్ యశ్వంత్‌ను చూసి.

"అవును. ఆ క్రీమ్ కలర్ స్లీవ్‌లెస్ డాంసెల్ గురించే నేను కామెంట్ చేశాను. ఏం నీకు నచ్చలేదా?" మామూలుగా అడిగాడు అనిల్.

"షటప్. యూ బ్లడీ. హౌ డేర్ యూ" గట్టిగా అరిచాడు. ఏమీ అర్థం కాలేదు అనిల్‌కు. రెండో బాటిల్ బీర్‌కే అంత అదుపుతప్పి ప్రవర్తిస్తున్నాడంటే ఆశ్చర్యంగా ఉంది అనుకున్నాడు. అయినా మెల్లిగా అడిగాడు.

"ఏం ఎందుకలా అరుస్తారు? మీరు కామెంట్ చేసినంత బాగా నేను చెయ్యలేదా? లేక.... ...." అప్పటికే ప్రక్క టేబుల్ జనం వీళ్ళనే తదేకంగా చూస్తున్నారు.

"నో నో స్టాపిట్. షి ఈజ్ మై వైఫ్ డామిట్" హిస్టీరికల్‌గా మరింత బిగ్గరగా అరిచాడు.

"ఓహో అలాగా. అయాం సారీ. నాకు తెలీదులే" కొంచెం కొంచెంగా విస్కీ మత్తువదిలించుకుంటూ చెప్పాడు అనిల్. సడెన్‌గా జ్ఞాపకం వచ్చింది.

"అయినా మీరు వివాహం చేసుకోలేదన్నారుగా మరి వైఫెలా వచ్చింది. ప్లీజ్. చెప్పండి. ఇదెలా జరిగింది?" అడిగాడు అనిల్. ఓ నిముషం మౌనం రాజ్యమేలింది.

"ఓ... నో. నను నమ్ము అనిల్. నాకు పెళ్ళయింది. ఆమె నిజంగా నా భార్య మిసెస్ సంగీత. కావాలంటే ఆమెను నీకు పరిచయం చేస్తాను. పెళ్ళి కాలేదని ఏదో ఫ్యాన్సీ కలా అబద్ధం చెప్పాను. అసలు సంగీత ఈ పార్టీకి వస్తుందని నాకు తెలీదు" తల పట్టుకుని, తలవంచుకుని కూర్చుని కూర్చున్నాడు.

"అయాం రియల్లీ సారీ" అనిల్ చెప్పాడు.

"లీవిట్. అంతా నా ఖర్మ. తప్పంతా నాదే. మొదట కామ్‌గా ఉన్న నిన్ను లేడీస్ గురించి అసహ్యంగా కామెంట్ చెయ్యమని రెచ్చగొట్టింది నేను. నీవు కామెంట్ చేస్తే కోపం తెచ్చుకుంది నేనే. ఇక ఎవుడూ ఇలా చెయ్యనుగాక చెయ్యను. బుద్దొచ్చింది. అయాం సారీ అనిల్. ప్లీజ్ ఎక్స్‌క్యూజ్‌మి" మత్తు ఒక్కసారిగా దిగిపోయి దూరంగా పోతున్న యశ్వంత్‌ను ఎంత వారించినా ఆగకుండా వెళ్ళిపోయాడు. అతనికేసి ఆశ్చర్యంగా చూస్తుండి పోయాడు అనిల్.